స్టాలిన్‌కు విమర్శించే అర్హత లేదు

విశాలాంధ్ర - అంబాజీపేట : 2019లో తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేసి పార్టీ నగదుతో పరారైన నేలపూడి స్టాలిన్ బాబుకు పార్టీని, జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు విమర్శించే అర్హత లేదని జిల్లా అధికార ప్రతినిధి దొమ్మేటి వీర వెంకట సత్యనారాయణ అన్నారు. శనివారం పల్లేటికుర్రులో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల అనంతరం ఐదేళ్ల తర్వాత వైసీపీ కండువా కప్పుకోవడానికి స్టాలిన్‌కు సిగ్గు లేదన్నారు. మాజీ ఎంపీ పండుల రవీంద్రబాబు పిఏ అని చెప్పుకుని అనేక గ్రాంట్లలో కమిషన్‌లకు కక్కుర్తి పడిన విషయాలు అనేకం ఉన్నాయని గుర్తు చేశారు. దళితులపై అనేక దాడులు జరిగిన కిమ్మనలేదని ఎద్దేవా చేశారు. డాక్టర్ సుధాకర్ ప్రభుత్వ హత్య, ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్ సుబ్రహ్మణ్యాన్ని డోర్ డెలివరీ చేయడంపై ఏమాత్రం స్పందించలేదన్నారు. ఇకపై తెలుగుదేశం పార్టీ, నారా చంద్రబాబునాయుడు పై ఎటువంటి వ్యాఖ్యలు చేసినా తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా మంగళంపల్లి

విశాలాంధ్ర - అమలాపురం : రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా అమలాపురం పట్టణానికి చెందిన సీనియర్ వైకాపా నాయకులు, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు మంగళంపల్లి అంజిబాబు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నియామక ఉత్తర్వులు జారీ చేసింది. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అంజిబాబు ఆదినుండి ఎనలేని కృషి చేశారు. వైకాపా ప్రతిపక్ష పాత్ర పోషించిన సమయంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విజయమే తన ధ్యేయంగా భావించి ఆనాటి నుండి నేటి వరకు వైకాపా విజయంలో తన వంతు పాత్ర పోషిస్తూ వస్తున్నారు. సీఎం జగన్ ప్రవేశపెట్టిన ఎన్నో ప్రజా ఉపయోగ పథకాలను ప్రజల ముందుకు తీసుకు వెళుతూ సీఎం చొరవను వివరిస్తూ వస్తున్నారు. అటువంటి సీనియర్ వైకాపా నాయకులు మంగళంపల్లి అంజిబాబుకు ఎట్టకేలకు గుర్తింపు లభించింది. రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

పల్స్ పోలియో విజయవంతం చేద్దాం

విశాలాంధ్ర - రాజానగరం : నేడు జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సంయుక్తంగా కలిసి విజయవంతం చేద్దామని పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ రామ భాస్కర్ అన్నారు. మండల కేంద్రమైన రాజానగరంలో ఈ నెల 4వ తేదీన జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఉద్దేశించి శనివారం ర్యాలీ నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పరిధిలో మొత్తం నాలుగు మార్గాల్లో మొత్తం 34 బూత్ లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సచివాలయాలు వద్ద, జీఎస్ఎల్ హాస్పటల్ వద్ద, బస్ స్టాండ్ వద్ద పోలియో కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. తమ ఆసుపత్రి పరిధిలో మొత్తం 5191 మంది ఐదు ఏళ్ళు లోపు వున్న చిన్నారులు ఉన్నట్లు గుర్తించామని, వారికి రెండు చుక్కలు తప్పని సరిగా వేయించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ఈ ర్యాలీలో ఆసుపత్రి సూపర్ వైజర్ ఎస్.వివి.రమణ, పీహెచ్‌సీ సిబ్బంది, అశా వర్కర్లు పాల్గొన్నారు.

హస్తం అభ్యర్థుల జాబితాలో ముప్పిడి

విశాలాంధ్ర - రాజానగరం : నియోజకవర్గంలో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ సీట్ ముప్పిడి శ్రీనివాసుకి దక్కే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నయనీ ఆ పార్టీకి చెందిన పలువురు నాయకులు అన్నారు. మండలంలోని సూర్యారావుపేట గ్రామానికి చెందిన ముప్పిడి ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులుగా అటు పార్టీకి ఇటు ప్రజలకు వివిధ సేవలందించారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు సైతం పార్టీ జెండాను వదలకుండా పార్టీ బలోపేతానికి కృషి చేసిన తీరును గుర్తించిన అధిష్టానం స్వయంగా పిలిచి పార్టీ మండలాధ్యక్షునీ పదవి కట్టబెట్టింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు పార్టీలో ఎప్పటి నుండో ఉంటున్న తనకే పార్టీ టికెట్ ఇస్తుందని, పార్టీలో అధిక శాతం నేతలు తమకు మద్దతుగా ఉన్నారనీ, తనకే టికెట్ కేటాయించే లాగా అధినాయకత్వంతో మంతనాలు నడుపుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు

బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ

విశాలాంధ్ర - రావులపాలెం : అనేక ప్రాంతాల్లో జరిగిన బాబు ష్యూరిటీ భవిషత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో కొత్తపేట నియోజకవర్గ టిడిపి, జనసేన పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బండారు సత్యానందరావు పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేశారు. సూపర్ సిక్స్ పథకాలను గురించి ప్రజలకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రావులపాలెం మండల మరియు గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళలు పాల్గొన్నారు.

రాంబాబుకు టీడీపీ నాయకుల పరామర్శ

విశాలాంధ్ర - మామిడికుదురు : సతీ వియోగంతో బాధపడుతున్న మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ నామన రాంబాబును శనివారం పి గన్నవరం నియోజక వర్గ టీడీపీ నేతలు పరామర్శించారు. ఇటీవలే అనారోగ్యంతో నామన రాంబాబు సతీమణి కృష్ణవేణి మృతి చెందారు. ఆమె చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ, నామనకు మనోధైర్యాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పి గన్నవరం మండలం ప్రజా పరిషత్ ఉపాధ్యక్షురాలు చెల్లుబోయిన గంగాదేవి వెంకటేశ్వరరావు, పి గన్నవరం మాజీ ఉపాధ్యక్షుడు నేలపూడి దామోదర్, మొండిపులంక ఎంపిటిసి సభ్యురాలు ఉంద్రాజువరపు శాంతి కుమారి బాబీ తదితరులు పాల్గొన్నారు.

సముద్ర తాబేళ్ల సంరక్షణపై శిక్షణ

విశాలాంధ్ర - కాట్రేనికోన : కందికుప్ప శివారు శాక్రమెంటో లైట్ హౌస్ వద్ద శనివారం వైల్డ్ లైఫ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియా ప్రతినిధి, బి రాజశేఖర్, అపర్ణ, అర్పితా రాయ్, రీసెర్చ్ అసోసియేట్స్ సముద్ర తాబేళ్ల సంరక్షణపై శిక్షణ మరియు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కోనసీమ జిల్లాలో వాసాలతిప్ప, ఎస్ యానాం, గచ్చకాయల పొర, శాక్రమెంటో ఐలాండ్ అనే నాలుగు ప్రదేశాలలో సముద్ర తాబేళ్ల సంరక్షణ హేచరీలను ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ సంరక్షణ హేచరీల యందు ప్రొటెక్షన్ హెల్పర్లుగా విధులను నిర్వహిస్తున్న 16 మంది స్థానిక యువకులు మరియు అటవీ శాఖ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పర్యావరణ వ్యవస్థలో సముద్ర తాబేళ్ల ప్రాముఖ్యత మరియు వాటి సంరక్షణ విషయంలో తీసుకోవాల్సిన చర్యలపై ఈ కార్యశాలలో అవగాహన కల్పించారు. డిఎఫ్ఓ ఎంవి ప్రసాదరావు, అమలాపురం ఎఫ్ఆర్ఓ ఎన్ బిఎస్వి హరికుమార్, కోరంగి ఎఫ్ఆర్ఓ వరప్రసాద్, బయాలజిస్ట్ మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాంప్ సర్వే వేగవంతం చేయాలి: కలెక్టర్

విశాలాంధ్ర - కాకినాడ : సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను(ఎంఎస్ఎంఈ) మెరుగు పరచడం, అభివృద్ధిని వేగవంతం చేసే నిమిత్తం ప్రభుత్వం చేపట్టిన ర్యాంప్ సర్వే వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా కృతికాశుక్లా ఆదేశించారు. శనివారం విజయవాడ సీఎస్ క్యాంపు కార్యాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా కెఎస్ జవహర్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రెవెన్యూ అంశాలకు సంబంధించి మూడవ దశ రీసర్వే, ఇనామ్, అసైన్డ్ భూములు, హౌస్ సైట్స్ రిజిస్ట్రేషన్స్, పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి ఎన్ఆర్ఈజీఎస్, కరువు మండలాల్లో పని దినాలు, తాగు, సాగు నీరు, పరిశ్రమల శాఖలో ఎంఎస్ఎంఈ క్లస్టర్ లకు భూ కేటాయింపు, వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖలో అమలవుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, పల్స్ పోలియో ఇమ్యునైజేషన్ వంటి ఇతర ప్రభుత్వ ప్రాధాన్య అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు జాయింట్ కలెక్టర్లతో సీఎస్ జవహర్ రెడ్డి సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ డా కృతికాశుక్లా, జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంఎస్ఎంఈలను మెరుగు పరచడం, అభివృద్ధిని వేగవంతం చేసే నిమిత్తం ప్రభుత్వ ర్యాంప్ సర్వే ప్రక్రియ జిల్లాలో మార్చి 01 నుంచి ప్రారంభమైందన్నారు. ఈ ఎంఎస్ఎంఈ సర్వే ద్వారా తయారీ, సేవ, వాణిజ్య రంగాల్లోని వివిధ సంస్థలను డిజిటల్ ప్లాట్ ఫామ్ లోకి తీసుకువచ్చి ఏపీఎంఎస్ ఎంఈ వన్ పోర్టల్‌కు అనుసంధానం చేస్తారని ఆమె వివరించారు. అధికారులు ఈ సర్వేపై ప్రత్యేక దృష్టి పెట్టి మార్చి 20 నాటికి పూర్తి చేయాలని అధికారులకు కలెక్టర్ స్పష్టం చేశారు. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో సాగు, తాగు నీరులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఇందుకు ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఎంహెచ్ఓ డా జే నరసింహ నాయక్, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డా పి రాధాకృష్ణ, ఏడి సర్వే బి లక్ష్మినారాయణ, డ్వామా పీడీ ఎ వెంకటలక్ష్మి, ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీర్ ఎం శ్రీనివాసు, ఏపీఐఐసీ జెడ్ఎం ఎ రామణా రెడ్డి, పరిశ్రమలు శాఖ ఏడీ కె కృష్ణార్జునరావు వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

తళుక్కున మెరిసిన ఎమ్మెల్యే చంటిబాబు

విశాలాంధ్ర - జగ్గంపేట : ఎమ్మెల్యే జ్యోతుల చంటి బాబు శనివారం మండలంలో తళుక్కున మెరిశారు. అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్‌గా తోట నరసింహంను నియమించడంతో ఎమ్మెల్యే చంటి బాబు గత రెండు నెలలుగా పార్టీ కార్యక్రమాలకు, ప్రభుత్వ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. అప్పటి నుండి నరసింహం ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలకు అధికారికంగా ఎమ్మెల్యే పాల్గొనాల్సి ఉంటుంది. ఇలా ఇంచార్జి కార్యక్రమాలను నిర్వహిస్తున్న క్రమంలో గత అసెంబ్లీ సమావేశాల ముందు రోజు మల్లిపాక, ఇర్రిపాక గ్రామాలకు వెళ్ళే రోడ్డు వేసే పనులను చంటిబాబు ప్రారంభించారు. అప్పటి వరకు రెండు నెలలు దూరంగా ఉన్న ఆయన ఒక్కసారిగా ఆ కార్యక్రమంలో పాల్గొన్నారు. అప్పటి నుండి మరలా నియోజకవర్గంలో ఎక్కడా కనిపించలేదు. ఇప్పుడు మరలా తళుక్కున మెరిసి గుర్రంపాలెం, రాజపూడి గ్రామాల్లో జలజీవన్ మిషన్ ద్వారా నిర్మించిన వాటర్ ట్యాంకులను ఆయన ప్రారంభించారు. ఎంపీపీ అత్తులూరి నాగబాబు, వైఎస్ ఎంపిపి నక్కా శ్రీను, రాజపూడి సర్పంచ్ బుసాల విష్ణు మూర్తి, వైసిపి నాయకులు జనపరెడ్డి సుబ్బారావు, ఇళ్ల అప్పారావు కాపు, సందక బాబురావు, ముత్యాలరావు, వుయ్యూరి నాని, రాజు, నక్క సూరిబాబు, కృష్ణార్జున, తదితరులు ఉన్నారు.

గ్రామ సచివాలయం వెలవెల

విశాలాంధ్ర - గోకవరం: ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సంకల్పం ఇక్కడ నీరుగారుతోంది. గోకవరం మండలం అచ్యుతాపురం గ్రామంలో 43 లక్షల రూపాయల ఖర్చుతో నిర్మించి, ఎంతో అట్టహాసంగా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ప్రారంభించిన, గ్రామ సచివాలయ నూతన భవనంలో ఉద్యోగులు విధులు నిర్వర్తించకపోవడంతో ఆ భవనం వెలవెలబోతోంది. ఈనూతన భవనాన్ని ప్రారంభించి నాలుగు నెలలు గడిచినప్పటికీ, ఇక్కడ మాత్రం సచివాలయ ఉద్యోగులు తమ విధులు నిర్వహించకుండా, గతంలో ఉన్న గ్రామపంచాయతీ భవనంలోనే కాలం గడుపుతున్నారు. ఎంతో ఉన్నత ఆశయంతో గ్రామ సచివాలయ నూతన భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్ భవనం రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణం జరుగుతున్నాయి. ఇందులో భాగంగానే అచ్యుతాపురం గ్రామంలో గ్రామ సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్ర భవనం నిర్మాణం చేసి ఎమ్మెల్యే ప్రారంభించారు. హెల్త్ క్లినిక్ భవన్ ఇక్కడ మంజూరు కాకపోవడంతో, భవనం నిర్మించకపోయినప్పటికీ, ప్రస్తుతం ఉన్న గ్రామ పంచాయతీ భవనాన్ని హెల్త్ క్లినిక్ సిబ్బంది సేవలు ఉపయోగించుకోవచ్చని ఎమ్మెల్యే చంటిబాబు అప్పట్లో సూచించారు. నూతన భవనం ప్రారంభించినప్పటికీ, ఇక్కడ సేవలు అందటం లేదు. ఆధరాబాధరా భవనం ప్రారంభించినప్పటికీ, ఉద్యోగులు షిఫ్ట్ అవ్వకపోయినా, పట్టించుకునే అధికారులు కరువయ్యారు. ఈనూతన భవనంలో గ్రామ సచివాలయ ఉద్యోగులు బాధ్యతలు నిర్వర్తించకపోవటానికి కారణాలు తెలియరావడం లేదు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని ఇప్పటికైనా లక్షల రూపాయల ఖర్చు చేసి నిర్మించిన ఈనూతన భవనం సద్వినియోగం చేసుకోవాలని, ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సంకల్పం విజయవంతం కావడానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సమర్థవంతంగా ఎన్నికల విధులు

విశాలాంధ్ర - కాకినాడ : త్వరలో జరగనున్న ఎన్నికలను సజావుగా నిర్వహించడంలో వివిధ విభాగాల్లో నియామకమైన ఎన్నికల సిబ్బంది సమర్థవంతంగా పనిచేయాలని కాకినాడ సిటీ నియోజకవర్గ ఈఆర్వో, కార్పొరేషన్ కమిషనర్ జె.వెంకటరావు కోరారు. స్థానిక స్మార్ట్‌సిటీ కార్యాలయంలో శనివారం సాయంత్రం మోడల్ కోడ్ఆఫ్ కాండక్ట్, ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు, స్టాటిస్టిక్స్ సర్వేలైన్స్ బృందాలు, వీడియో సర్వేలైన్స్ బృందాలు, పోలీస్ సెక్టార్ ఆఫీసర్లు, ఐటి బృందాలకు ఎన్నికల విధులపై శిక్షణనిచ్చారు. డీఎస్పీ కె.హనుమంతరావు, డిఎల్‌డీవో ప్రసాదరావుతో పాటు సెక్టోరల్ అధికారులు, రూట్ ఆఫీసర్లు హాజరయ్యారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి నియమితులైన సిబ్బందికి మాస్టర్ ట్రైనర్లు శిక్షణ నిర్వహించారు. ఎన్నికలు జరిగే రోజున, అంతకుముందు చేపట్టాల్సిన విధులు, బాధ్యతలను వివరించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, మేనేజర్ కర్రి సత్యనారాయణ, ఏఈ ఆర్వోలు హరిదాసు, నాగశాస్త్రులు, ఆర్వో డిటి నాయుడు పాల్గొన్నారు.

పి.గన్నవరం స్థానికులకు కేటాయించాలి

విశాలాంధ్ర - అంబాజీపేట : తెలుగుదేశం, జనసేన పార్టీ ఉమ్మడి అభ్యర్థిగా పి గన్నవరం నియోజకవర్గానికి చెందిన వారికి కేటాయించాలని మండల సమన్వయ కమిటీ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. టిడిపి, జనసేన పార్టీల మండల ఉమ్మడి సమావేశం శనివారం స్థానిక వెంకట్రాజు ఆయిల్ మిల్లు ఆవరణలో మండల తెలుగుదేశం పార్టీ కార్యదర్శి గుడాల ఫణి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్యే సీటుపై నాయకులు, కార్యకర్తలు చర్చించారు. ఈ సందర్భంగా టిడిపి, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు మాట్లాడుతూ గత ఐదేళ్లుగా పార్టీల కోసం ఆహరహం శ్రమిస్తున్న నాయకులను విస్మరించి ఎక్కడినుండో వచ్చిన టిడిపి, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థిగా మహాసేన రాజేష్ ప్రకటించడంతో పి గన్నవరం నియోజకవర్గంలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తపడం తెలిసిందేనన్నారు. కష్టపడి పనిచేసేవారికి కేటాయంచకుండా స్థానికేతురలైన వారికి కేటాయించడం నాయకులు, కార్యకర్తలు అభ్యర్థిని మార్పు చేయాలని డిమాండ్ చేసారు. ఈ సమావేశంలో జిల్లా టిడిపి అధికార ప్రతినిధి దాసరి వీరవెంకటసత్యనారాయణ, క్లస్టర్ ఇంచార్జ్ గణపతి వీరరాఘవులు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జనసేన ఉపాధ్యక్షులు శిరిగినీడి వెంకటేశ్వరరావు, నాయకులు అరిగెల బలరామూర్తి, నాగాబత్తుల సుబ్బారావు, అరిగెల సూరిబాబు, సర్పంచ్‌లు జల్లి బాలరాజు, నాగాబత్తుల శాంతకుమారి, బొండాడ నాగమణి, దొమ్మేటి సాయికృష్ణ సుంకర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల రిజిస్ట్రేషన్ విప్లవాత్మక నిర్ణయం: ఎమ్మెల్యే

విశాలాంధ్ర - కాకినాడ : అర్హత కలిగిన ప్రతీ ఒక్క లబ్ధిదారునికి స్థలం ఇచ్చి ఇల్లు నిర్మించడంతోపాటు రిజిస్ట్రేషన్లు కూడా చేసి అప్పగించే విధానం దేశంలో ఎక్కడాలేదని సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న ఈ విధానం విప్లవాత్మకమైనదన్నారు. స్థానిక ఉప్పాడ కొత్తపల్లిలో 10,11,12 డివిజన్లకు చెందిన లబ్ధిదారులకు సుమారు 23 ఎకరాల లేఅవుట్‌లో 889 మందికి శనివారం ఇళ్ళ పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు కేటాయించిన స్థలాలు, కొమరగిరిలో నిర్మిస్తున్న ఇళ్ళను బస్సులలో తీసుకువెళ్ళి చూపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ ఎంతో మంది అక్కాచెల్లెమ్మల ముఖంలో సంతోషం వెల్లివిరియాలనే లక్ష్యంతోనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇళ్ళ స్థలాలను మహిళల పేరుతోనే జారీ చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడ ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, కార్యదర్శి ఎం ఏసుబాబు, మాజీ మేయర్, వైఎస్ఆర్‌సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎఎంసీ ఛైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, మాజీ డిప్యూటీ మేయర్ మీసాల ఉదయ్‌కుమార్, జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, ఐటిసెల్ ఛైర్‌పర్సన్ కృష్ణప్రియ, పలువురు మాజీ కార్పొరేటర్లు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బూరెల బుట్టలో విప్పర్తి

విశాలాంధ్ర - అమలాపురం : పి గన్నవరం వైసిపి అభ్యర్థి విప్పర్తి వేణుగోపాల్ పరిస్థితి బూరెలా బుట్టలో పడ్డట్టే ఉంది. ఆయనకు పోటీగా వచ్చిన తెలుగుదేశం జనసేన ఉమ్మడి అభ్యర్థి సరిపెళ్ల రాజేష్ అలియాస్ మహాసేన రాజేష్ పేరు ప్రకటించటంతో ఆయన అభ్యర్థిత్వం పట్ల సర్వత్రా విమర్శలు వస్తుండటంతో లోకేష్ సూచన మేరకు కార్యకర్తల అగ్రహావేశాల్ని చల్లార్చేందుకు వెళ్లిన అమలాపురం పార్లమెంటరీ తెలుగుదేశం ఇంచార్జి హరీష్ బాలయోగికి సైతం భంగపాటు తప్పలేదు. గతంలో మహాసేన రాజేష్ ఇతర కులాలను జనసేన పార్టీని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు నియోజక వర్గ టిడిపి, జనసేన కాడర్లలో ఆగ్రహావేశాలు రగిల్చాయి. దానికి తోడు నియోజకవర్గంలో ఎంతో మంది ఆశావహులు ఉండగా వివాదాస్పదుడు స్థానికేతరుడైన రాజేష్‌ని అభ్యర్థిగా దించటాన్ని నియోజకవర్గ దళితులు కూడా ఆగ్రహంతో ఊగిపోతున్నారు. ఈ పరిస్థితులు అన్నీ వైఎస్ఆర్‌సిపి అసెంబ్లీ అభ్యర్థి విప్పర్తి వేణుగోపాల్‌కి చాలా బాగా కలిసివచ్చే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఒకవేళ మహాసేన రాజేష్‌ని తప్పించి మరో అభ్యర్థిని పోటీకి నిలిపినా కూడా విప్పర్తికి వచ్చిన నష్టం ఏమి ఉండదని రాజకీయ పండితులు అంచనా వేస్తున్నారు.

కిక్ బాక్సింగ్‌కు స్కూల్ విద్యార్థి ఎంపిక

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం: రాజమండ్రి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజమహేంద్రి విద్యాసంస్థల చైర్మన్ టీ.కే. విశ్వేశ్వర రెడ్డి మాట్లాడుతూ రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్లో 7 తరగతి చదువుతున్న విద్యార్థి పి.సాయి కృష్ణ కిక్ బాక్సింగ్‌లో వరల్డ్ ఛాంపియన్ షిప్‌కి ఎంపికయ్యారని చెప్పారు. ఫిబ్రవరి 6 వ తారీకు నుండి 11 వ తారీకు వరకు న్యూఢిల్లీలోని ఇందిరా గాంధీ స్టేడియంలో జరిగిన వాకో ఇండియా ఓపెన్ ఇంటర్నేషనల్ కిక్ బాక్సింగ్ ఛాంపియన్షిప్‌లో కాంస్య పతకం సాధించారని అన్నారు. రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్‌లో డెకాథ్లాన్ వారు రోలర్ స్కేటింగ్ ఛాంపియన్షిప్ పోటీలు మార్చి 3వ తేదీ ఉదయం 6 గంటల నుండి సాయంత్రం వరకు జరుగుతాయని, ఈ పోటీల్లో నెగ్గిన వారికి మెడల్స్ మరియు సర్టిఫికెట్లు కూడా ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. ఈ సందర్భంగా కిక్ బాక్సింగ్ లో వరల్డ్ ఛాంపియన్ షిప్ కి ఎంపికైన రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థి పి. సాయి కృష్ణ కి పుష్పగుచ్ఛిమిచ్చి విశ్వేశ్వర రెడ్డి అభినందించారు. సమావేశంలో స్కూల్ కిక్ బాక్సింగ్ కోచ్ సామ్యూల్, విద్యార్థి తల్లిదండ్రులైన పి.శ్రీనివాసరావు, పి.సత్య కళ పాల్గొన్నారు.

కాకినాడ రూరల్ సీటు శెట్టిబలిజలకే కేటాయించాలి

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ రూరల్ అసెంబ్లీ నియోజకవర్గ సీటును రాజకీయ ప్రధాన పార్టీలన్నీ ఆ నియోజకవర్గంలో అత్యధిక ఓటు బ్యాంకు కలిగిన శెట్టిబలిజ సామాజిక వర్గీయులకే కేటాయించాలని శెట్టిబలిజ జన జాగృతి సేవా సంఘం, బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్తంగా డిమాండ్ చేశాయి. ఈ మేరకు వారు కాకినాడలో విలేకరులతో సమావేశం నిర్వహించి ఆవేదనను వ్యక్తం చేశాయి. శెట్టిబలిజ జన జాగృతి సేవా సంఘం అధ్యక్షుడు రాయుడు నాగేశ్వరరావు, బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వాసంశెట్టి భీమరాజు, సేవా సంఘం ప్రధాన కార్యదర్శి కర్రి గోపాలకృష్ణలు విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాకినాడ రూరల్ అసెంబ్లీ సీటు గత కొంతకాలంగా శెట్టిబలిజ సామాజిక వర్గీయులకు ఏదో ఒక పార్టీ కేటాయిస్తుందని ఈసారి అది జరగలేదన్నారు. కావున రూరల్ సీటును శెట్టిబలిజలకే కేటాయించాలని అలాగే ఇతర నియోజకవర్గాల్లో బీసీ సామాజిక వర్గానికి కేటాయిస్తే వారికే తమ పూర్తి మద్దతు ఉంటుందన్నారు. కాకినాడ రూరల్లో శెట్టిబలిజలకు సీటు కేటాయించని పక్షంలో తామే ఒక అభ్యర్థిని ఎంపిక చేసి స్వతంత్రంగా పోటీ చేసి తమ ఓట్లను తామే వేసుకుంటామంటూ నాగేశ్వరరావు, భీమరాజు, గోపాలకృష్ణలు చెప్పారు. శెట్టిబలిజలను అనిచివేతకు కుట్ర జరుగుతోందని వారికి మా సత్తా చూపిస్తామని శెట్టిబలిజ జన జాగృతి సేవా సంఘం మహిళా అధ్యక్షురాలు రాయుడు దుర్గ హెచ్చరించారు. సీటు కేటాయించిన వారిని ఆరాధిస్తామని ఆమె చెప్పారు. ఈ సమావేశంలో బీసీ వెల్ఫేర్, జన జాగృతి నాయకులు రాయుడు సుధాకర్, మేడిశెట్టి లక్ష్మణరావు, పల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి: డీఎస్పీ

విశాలాంధ్ర - గోపాలపురం : రెండు వేరువేరు సంఘటనలలో గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులను, రూ.7.5 లక్షలు నగదు దొంగతనం చేసిన మహిళ, యువకుని అరెస్టు చేసినట్లు డీఎస్పీ కే సిహెచ్ రామారావు తెలిపారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఇద్దరు యువకులు సీకే గౌతమరాజ్, కేఎస్ వినయ్ కుమార్ పూల వ్యాపారంలో నష్టం వాటిల్లిన సందర్భంగా అక్రమ గంజాయి వ్యాపారానికి పాల్పడుతూ అక్రమ లాభార్జన చేస్తున్నామన్నారు. శుక్రవారం సాయంత్రం గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్నతాధికారుల ముందస్తు సమాచారంతో మండలంలోని జగన్నాధపురం పోలీస్ చెక్ పోస్ట్ వద్ద దేవరపల్లి సీఐ పీ బాలసురేష్ బాబు, ఎస్ఐ కే సతీష్ కుమార్ మరియు రెవెన్యూ సిబ్బందితో తనిఖీ నిర్వహించి గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 4 కేజీల 290 గ్రాముల గంజాయిని స్వాధీనం పరు చుకున్నామన్నారు. ఆంధ్ర రాష్ట్రం ఏజెన్సీ ప్రాంతాల నుంచి చిన్న మొత్తంలో కొనుగోలు చేసి అమ్ము కుంటూ తమ జీవనాన్ని గడుపుతున్నామని తెలిపారు. ఇదిలా ఉండగా తెలంగాణ రాష్ట్రానికి చెందిన పైట్ల సాయిబాబా వయసు 60 ఇతను దేవత హనుమంతరావు అను వారి వద్ద 20 సంవత్సరాలుగా అపరాల వ్యాపారంలో గుమస్తగా పనిచేస్తున్నట్లు తరచూ అపరాలను కాకినాడ తీసుకుని వెళ్లి అమ్ముతున్నట్లు అతను తెలిపాడు. అపరాలు అమ్మిన డబ్బులు 7,50,000 తన బ్యాగులో పెట్టుకుని గత నెల 29 న కాకినాడలో బస్సు ఎక్కి రాజమండ్రిలో దిగినట్లు అక్కడ సాయిబాబాకు గతంలో పరిచయం ఉన్న మండపేట గ్రామానికి చెందిన ఎర్నేటి విజయ్ కుమారి ఆమె అల్లుడు మాద మణికుమార్ కనబడినట్లు మేము కూడా తెలంగాణ వస్తున్నామని మాట్లాడి సాయిబాబాతో రాజమండ్రి నుండి బస్సు ఎక్కి ప్రయాణం చేస్తున్నట్లు తెలిపారు. సాయిబాబా ఫిర్యాదు పై దేవరపల్లి సిఐ బాలసురేష్ బాబు మరియు ఎస్ఐ కే సతీష్ కుమార్ మండపేట వెళ్లి ఇద్దరు ముద్దాయిలను చేకచక్యంగ పట్టుకొని వారి వద్ద నుండి రూ 7,50,000 స్వాధీన పరుచుకున్నట్లు డిఎస్పి వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ సి సత్యానందం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభించిన మంత్రి

విశాలాంధ్ర - ఉప్పలగుప్తం : అసంపూర్తిగా మిగిలిపోయిన అభివృద్ధి పనులన్నింటిని నెల రోజులలో పూర్తి చేస్తారని మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. ఉప్పలగుప్తం మండలంలో శనివారం పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. పెదగాడవిల్లిలో గ్రామసచివాలయ భవనాన్ని ప్రారంభించి పెద్దూరులో పంటకాలువపై నిర్మించిన వంతెన ప్రారంభం అనంతరం జగ్జీవన్ రామ్ కమ్యూనిటీ భవనంను ప్రారంభించారు. ఉప్పలగుప్తంలో గ్రామసచివాలయం మధురపేటలో కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభించిన తదుపరి తాగునీరు సరఫరా ఓవర్ హెడ్ టాంక్‌ను ప్రారంభించిన అనంతరం 43 లక్షల రూపాయల నిధులు ఖర్చుచేసి నిర్మించిన అంబేద్కర్ కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి బొమ్మి ఇశ్రాయేల్, జడ్పీటిసి గెద్దం సంపదరావు, మండల సర్పంచ్ల సమైఖ్య అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, దంగేటి రాంబాబు, బద్రి, బాబ్జి, జున్నూరి వెంకటేశ్వరరావు, ఇసుకపట్ల రఘుబాబు, పెయ్యల విష్ణుమూర్తి, మోటూరి సత్తెంకాపు, చిక్కం బాలయ్య, ఎర్రం చెట్టీ రామచంద్రరావు, పెయ్యల దుర్గారావు, కోటుం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలులో మహిళకు ప్రాధాన్యత: మంత్రి

విశాలాంధ్ర-దేవరపల్లి: ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలులో మహిళకు ప్రాధాన్యత ఇచ్చి రాష్ట్రంలో సుపరిపాలన అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిదేనని హోం శాఖ మంత్ర తానేటి వనిత అన్నారు. దేవరపల్లి మండలం ఎర్నగూడెం త్యాజంపూడి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఆత్మీయ సమావేశం శనివారం జరిగింది. మండల వైఎస్ఆర్సిపి కన్వీనరు సతీష్ అధ్యక్షతన జరిగిన సభలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా వనిత మాట్లాడుతూ గోపాలపురం అసెంబ్లీ నియోజకవర్గం నుండి తనను రాజమండ్రి పార్లమెంటు నియోజకవర్గం నుండి లోక్సభ నియోజకవర్గం వైసీపీ అభ్యర్థి గూడూరు శ్రీనివాసులును గెలిపించాలని కోరారు. గూడూరు శ్రీనివాస్ మాట్లాడుతూ మీ ఆశీర్వాదం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కేవీకే దుర్గారావు ఏఎంసి చైర్మన్ జనార్దనలో మాజీ చైర్మన్ ఎస్ రాజేంద్ర బాబు సర్పంచ్ బొంత భరత్ బాబు ఉప సర్పంచ్ నరహరశెట్టి దొరబాబు ఎంపీటీసీ బొంత చినబాబు కూచిపూడి సతీష్ పోతులు కనకరాజు త్యాజంపూడి సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు

సమిష్టి కృషితోనే విజయం సాధ్యం

విశాలాంధ్ర - సీతానగరం: ఇరు పార్టీల సమిష్టి కృషితోనే విజయం సాధ్యం అని రాజానగరం టీడీపీ, జనసేన ఇంచార్జిలు బొడ్డు వెంకటరమణ చౌదరి, బత్తుల బలరామకృష్ణ అన్నారు. మండలంలో సీతానగరం గ్రామంలో గల జివికె హాల్లో ఇరు పార్టీల అత్మీయ సమావేశం నిర్వహించారు. ఇప్పటికే సీటు జనసేన ఇంచార్జి బత్తుల బలరామకృష్ణకు ప్రకటించిన సంగతి అందరికీ తెలిసిందే. దీనికి అనుగుణంగా ఇరుపార్టీల నాయకులు, కార్యకర్తలు, జన సైనికులుతో సభ జరిగింది. ఈ సందర్భంగా బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ గ్రామ స్థాయిలో అనేక కమిటీలు టీడీపీకి ఉన్నాయి వాటిని వినియోగించుకొని విజయమే లక్ష్యంగా ప్రతీ ఒక్కరూ పని చేయాలని కోరారు. బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ ఇరు పార్టీల నాయకులు కార్యకర్తలు పరస్పర మద్దతుతో రాజానగరం నియోజకవర్గంలో వైసిపిని తరమి కొట్టే విధంగా జనసేన విజయమే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చిట్టురి రంగారావు, వలవల రాజా, పెందుర్తి అచ్చియా, బత్తుల వెంకటలక్ష్మి, మట్టా వెంకటేశ్వరరావు, విజయ్ శంకర్ మొదలగు టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికి మోదీ కృషి

విశాలాంధ్ర-కొవ్వూరు: పేద మధ్యతరగతి వర్గాలకు నిత్యావసర ఆహార పదార్థాలను ప్రధాని నరేంద్ర మోడీ తక్కువ ధరలకే అందచేస్తున్నారని కొవ్వూరు నియోజకవర్గం బిజెపి యువ నాయకుడు గండ్రోతు పవన్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని మెరక వీధిలోని ఆయన కార్యాలయం వద్ద పవన్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి ఫుడ్ సేఫ్టీ పథకం కింద ప్రజలకుకిలో 29 రూపాయలకే సన్న రకం బియ్యాన్ని అదేవిధంగా అత్యల్ప తక్కువ ధరకు సెనగలు ఆట పిండి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ మార్కెట్లో నిత్యవసర వస్తువులు ధరలు ఆకాశాన్ని అంటాయని ఈ సమయంలో ప్రధానమంత్రి మోడీ చొరవ తీసుకుని నిత్యవసర వస్తువులను కేవలం నామమాత్ర ధరకు ప్రజలకు అందజేస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రధానమంత్రి మోడీకి విజయాన్ని అందించి ఆయన రుణాన్ని మనం తీర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు సురేంద్రనాథ్ బెనర్జీ,పిక్కి నాగేంద్ర, కార్యకర్తలు పాల్గొన్నారు.

వివేక కేసులో సీఎం పాత్రపై విచారణ జరిపించాలి

విశాలాంధ్ర -కొవ్వూరు: వివేకా హత్య కేసులో సీఎం పాత్ర పై విచారణ జరిపించాలని కొవ్వూరు తెలుగుదేశం నియోజకవర్గ ద్విసభ్య కమిటీ నాయకులు చౌదరి, కంటమని రామకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం టిడిపి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో జొన్నలగడ్డ చౌదరి మాట్లాడుతూ వివేకా హత్య కేసులో జగన్ రెడ్డి పాత్ర పై విచారణ జరిపించాలని ఇంతవరకు హత్య చేసిన వారిని వెనకేసుకుని వారికి కొమ్ముకాస్తూ శిక్ష పడకుండా వారిని కాపాడుతున్న జగన రెడ్డి నిజమైన నేరస్తుడని... అన్నారు. మరో సభ్యులు కంతమని రామకృష్ణ మాట్లాడుతూ వివేకా కుమార్తె జగన్ చెల్లెలు సునీత హత్యా రాజకీయాలు చేసేవారికి ఓటు వెయ్యవద్దని చెప్పటం జగన్ దుర్మార్గం చర్యలకు నిదర్శనం అని రాజకీయ లబ్ది కోసమే జగన్ ముఠా వివేకాను హతమార్చారని అన్నారు. టౌన్ ప్రెసిడెంట్ దాయన రామకృష్ణ గారు పొట్రూ శ్రీను, వేమగిరి వెంకటరావు , వరిగేటి కాంతరాజు, కొక్కిరిపాటి వెంకటేష్ పాల్గొన్నారు.

స్థానికుడ్నే ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించాలి

విశాలాంధ్ర - ఉండ్రాజవరం: దశాబ్దన్నర కాలంగా నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ, అభివృద్ధికి చిరునామాగా నిలిచిన బూరుగుపల్లి శేషారావును రానున్న సార్వత్రిక ఎన్నికలలో నిడదవోలు నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థిగా ప్రకటించాలని నియోజకవర్గ టిడిపి కార్యకర్తలు శనివారం వేలివెన్ను శేషారావు ఇంటి వద్ద ఆందోళన నిర్వహించారు. రెండు రోజులుగా రాజకీయ అజ్ఞాతంలో ఉన్న బూరుగుపల్లి బయటకు రావాలని కోరుతూ చలో వేలివెన్ను కార్యక్రమం నిర్వహించారు. స్థానిక శశి కాలేజీ గ్రౌండ్ నుండి ఎన్టీఆర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించి, అనంతరం శేషారావు ఇంటి వద్దకు భారీ సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు చేరుకున్నారు. జై చంద్రబాబు, జై పవన్ కళ్యాణ్, జై బూరుగుపల్లి శేషారావు, శేషారావు నాయకత్వం వర్ధిల్లాలి, ఉమ్మడి అభ్యర్థిగా శేషారావును ప్రకటించాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రజల్లో లేని అభ్యర్థిని ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించవద్దంటూ, తమ ఆవేదన తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబుకు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు చేరేలా ఈ ఆందోళన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. శేషారావు స్పందిస్తూ కార్యకర్తల మనోభావాలకు అనుగుణంగా నడుచుకుంటానని, అధిష్టానం పార్టీలో కష్టపడే వ్యక్తులను గుర్తిస్తుందన్నారు. అభ్యర్థిత్వంపై తనకింతవరకు అధిష్టానం నుండి ఎటువంటి సమాచారం లేదని, సోషల్ మీడియాలో వచ్చే అపోహలు నమ్మొద్దన్నారు.

కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలి

ఎమ్మెల్యే మంతెన

విశాలాంధ్ర - కాళ్ళ : రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటు చేసేలా కార్యకర్తలు కలిసికట్టుగా పని చేయాలని ఉండి నియోజకవర్గ ఎమ్మెల్యే మంతెన రామరాజు అన్నారు. పెద అమిరం గ్రామం నుంచి ఉండి జనసేన ఇన్‌చార్జ్ జుత్తిగ నాగరాజుతో కలిసి శనివారం ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్రం అభివృద్ధిలో వెనుకబడి ఉందని, రాష్ట్ర ప్రజల భవిష్యత్తు కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసమే టీడీపీ జనసేనకలిసి పోటీ చేస్తున్నాయన్నారు. టీడీపీ అంటే జనసేన, జనసేన అంటే టీడీపీ అనే విధంగా కార్యకర్తలు పని చేయాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ మద్యం ముట్టుకుంటే షాక్ తగిలేలా ధరలు ఉన్నాయని, ఆక్వా రైతులు ఆత్మహత్య రైతులుగా మారారని ఆయన ఎద్దేవా చేశారు. చుట్టూ నీరు ఉన్న త్రాగడానికి నీరు లేదన్నారు. బొండాడ గ్రామానికి చెందిన మందపాటి కృష్ణమూర్తి తన తాత అయినటువంటి మందపాటి రామారావు జ్ఞాపకార్థం బొండాడ పేట చర్చికి రూ.1లక్ష విరాళంగా రామరాజు,నాగరాజు చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు, కటారి, నరసింహారాజు, అలుగు సెబాస్టిన్, అభిరుచి కాశి, గేదల జాన్, బందారు వేణు, గవర లక్ష్మి బూడి పరాలు,, వీరమల్లు శ్రీనివాస్, జనసైనికులు టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పొన్నాడ

విశాలాంధ్ర - ముమ్మిడివరం : మండలం అయినాపురం గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలలో స్థానిక శాసన సభ్యులు పొన్నాడ వెంకట సతీష్ కుమార్ పాల్గొన్నారు. అయినాపురంలో సచివాలయం-2 నూతన భవనాన్ని ప్రారంభించారు. అనంతరం జలజీవన్ మిషన్ మరియు ఓఎన్జిసి (సిఎస్ఆర్) నిధులతో నిర్మించనున్న 6 వాటర్ ట్యాంకులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అయినాపురం గ్రామానికి శాశ్వతంగా మంచినీటి సమస్య పరిష్కరించడానికి గతంలో ఆరు వాటర్ ట్యాంకులు ప్రారంభించామని ఇప్పుడు మరో 6 వాటర్ ట్యాంకులకు భూమి పూజ చేశామనిగతంలో ఏ ప్రభుత్వం ఈ గ్రామాన్ని పట్టించుకోలేదని జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో అనేక కార్యక్రమాలు చేపట్టమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పెనుమత్స చిట్టిరాజు,మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ పెయ్యల భూలక్ష్మి చిట్టిబాబు, జడ్పిటిసి కుడుపూడి శంకర్రావు, ఎంపీపీ కోలా గంగాభవాని బాబ్జి, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్ కుమార్, సర్పంచ్ మోకా రామారావు.గ్రామ కమిటీ అధ్యక్షులు ఇందుకూరి సుబ్బరాజు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయం సిబ్బంది, వార్డు వాలంటీర్స్ తదితరులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదు పూర్తి

విశాలాంధ్ర - మండవల్లి: రబీలో మినుము సాగు చేసిన రైతులందరికీ ఈ క్రాప్ నమోదు ప్రక్రియ పూర్తయిందని వ్యవసాయ శాఖ మండల అధికారి ఎస్ కె జరీనా తెలిపారు. కానుకల్లు గ్రామంలో గ్రామ వ్యవసాయ సహాయకులకు, మినుము సాగుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జరీనా మాట్లాడుతూ రబీలో మినుము పైరు సాగుచేసిన రైతులందరికీ వివరాలు, పంట నమోదు (ఈ-క్రాప్), ఈ-కేవైసీ ప్రక్రియ నమోదు చేయడం పూర్తయిందని తెలిపారు. ఈనెల1 నుంచి 3వ తేదీ వరకు ఈ-క్రాప్ చేసిన జాబితాలను పెరిగేగూడెం, లింగాల, కానుకొల్లు, అయ్యవారి రుద్రవరం, మండవల్లి, పుట్లచెరువు గ్రామాలలోని రైతు భరోసా కేంద్రాల వద్ద సామాజిక తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. రైతులందరూ వచ్చి తమ వివరాలను తనిఖీ చేసుకోవాలని, వాటిలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే లిఖితపూర్వకంగా రైతులు విఎఎలకు అందచేయాలని తెలియజేశారు. కానుకొల్లు రైతు భరోసా కేంద్రం సామాజిక తనిఖీ నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో విఎఎ జి.సంధ్య, గ్రామ సర్పంచ్ థామస్ పాల్గొన్నారు.

పౌష్టికాహార పంపిణీ

విశాలాంధ్ర - పాలకొల్లు: మానవత పాలకొల్లు మండల శాఖ ఆధ్వర్యంలో హెచ్ఐవి బాధితులకు పౌష్టికాహారాన్ని ప్రతి నెల క్రమం తప్పకుండా పంపిణీ చేయడం అభినందనీయమని పాలకొల్లు పట్టణం కొత్తపేట అర్బన్ ఆరోగ్య కేంద్ర వైద్యురాలు జి.హెన్నా తెలిపారు. శనివారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో శనివారం మానవతా పాలకొల్లు మండల శాఖ అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన పౌష్టికాహార పంపిణీ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మానవత సభ్యుడు బొక్కా రమాకాంత్ తన కుమారుడు శ్రీరామ్ సుమంత్ పుట్టినరోజు సందర్భంగా హెచ్ఐవి బాధిత 30 మంది పిల్లలకు పౌష్టికాహార ప్యాకెట్లను అందజేశారు. హెచ్ఐవీ బాధిత పిల్లలు ఆరోగ్యంగా మెలిగేందుకు దాతల సహకారంతో పౌష్టికాహారం అందజేసే కార్యక్రమంలో మా కుటుంబం భాగ స్వామ్యం కావడం సంతృప్తిగా ఉందన్నారు. ప్రతి నెల పౌష్టికాహారం అందజేస్తున్నామంటే దాతలు సహకారం మరువలేనిదని మండల శాఖ అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా దాత రమాకాంత్ ను మానవ తరుపున సత్కరించారు. ఈ కార్యక్రమంలో మానవతా కార్యదర్శి పేరిచర్ల ప్రతాప్ రాజు, సభ్యులు ధనాని సూర్య ప్రకాష్, బొక్క గంగాధర్, విన్నకోట వెంకటరమణ, తమ్మినీడి మురళీకృష్ణ, పిల్లల సంరక్షకురాలు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గాన కోకిల సరోజిని నాయుడు వర్ధంతి

విశాలాంధ్ర - తాళ్ళపూడి : మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల రాగోలపల్లిలో శనివారం భారత గాన కోకిల నైటింగేల్ ఆఫ్ ఇండియా సరోజిని నాయుడు వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు, విద్యార్థులు సరోజిని చిత్ర పటం వద్ద ఆమెకు నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయుడు దున్నా దుర్గారావు ఆమె జీవిత విశేషాలను, గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమం లో విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

పల్స్ పోలియో విజయవంతంచేయండి

విద్యాశాఖధికారి వెంకట రమణ

విశాలాంధ్ర - భీమవరం : జరిగే పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేయాలని జిల్లా విద్యాశాఖధికారి ఆర్.వెంకట రమణ పిలుపునిచ్చారు..శనివారం బి.ఆర్. అంబేద్కర్ సెంటరు వద్ద పల్స్ పోలియో ప్రచార ర్యాలీని జెండా ఊపి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు చేపట్టనున్న పల్స్‌పోలియో వ్యాక్సిన్‌ను 1-5 సంవత్సరాల చిన్నారులకు పోలియో చుక్కలను తప్పక వేయించాలన్నారు. జిల్లాలో 1,315 బూత్‌లు, 5,260 మంది అధికారులు, సిబ్బందిని నియమించామన్నారు. 5 సంవత్సరాలలోపు ఒక లక్ష 85 వేలు మంది చిన్నారులకు పోలియో చుక్కలు వెయ్యాలని గుర్తించామన్నారు. పల్స్ పోలియో కార్యక్రమంపై పట్టణాలోను , గ్రామాలలో సంబంధిత శాఖల సిబ్బంది , సచివాలయం, గ్రామ, వార్డు వాలంటరీలతో ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. అధికారులు, సిబ్బంది కలసి కట్టుగా పనిచేసి నూరు శాతం పోలియో చుక్కలు మొదటి రోజునే వేసేలాగా కృషి చేయాలని కోరారు. దూర ప్రాంతాలకు వెళ్ళినవారు, ఏ కారణం చేతనైన చుక్కలు వేయించక పోయినా 4,5 తేదీలు వైద్య సిబ్బంది ప్రతి ఇంటికి వస్తారని తప్పక చుక్కలు వేయించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్. వెంకట రమణ కోరారు.కార్యక్రమంలో జిల్లా అదనపు డిఎంహెచ్ఓ డా.బాను నాయక్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి దేవసుధా లక్ష్మి, జిల్లా ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటరు యస్. కీర్తి కిరణ్, ఐసిడియస్ అధికారి బి.సుజతా రాణి, శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనరు చెరుకువాడ రంగ సాయి, వైద్యాధికారులు, పల్స్ పోలియో టాస్క్ ఫోర్స్ అధికారులు, వైద్య సిబ్బంది, స్వాతి నర్సింగ్ కాలేజ్ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజాన్ని నిర్మించాలి

మున్సిపల్ చైర్మన్ వెంకట రమణ

విశాలాంధ్ర - నరసాపురం : నేడు జరగే పల్స్‌పోలియో చుక్కల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్మన్ వెంకట రమణ అన్నారు. నరసాపురం కార్యాలయం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకూ పల్స్ పోలియోపై హెల్త్ ,అంగనివాడీ ,మున్సిపల్ సిబ్బంది శనివారం ర్యాలీ నిర్వహిం చారు. ర్యాలీని మున్సిపల్ చైర్మన్ బర్రె వెంకట రమణ, కమీషనర్ కె.వెంక టేశ్వ రరావు కలసి ప్రారభించారు. ఈ సందర్భంగా చైర్మన్ వెంకట రమణ, కమీషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత సమాజాన్ని నిర్మించాలని అన్నారు. మార్చి 3వ తేదీన బూత్ స్థాయిలో పోలియో చుక్కలు వేయడం జరుగుతుందన్నారు. పట్టణంలో 40 బూత్ లలో మార్చి నెల మొదటి ఆదివారం ఉదయం గం. 7 నుంచి సాయంత్రం గం.5 వరకు జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో వైద్యులు కారిచర్ల మోహన, సోనియా, సత్యభూషణ్, హెల్త్ సూపర్ వైజర్లు, ఏయన్.యం ,ఆశాలు, అంగనివాడీ , మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

పల్స్‌పోలియో అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర - పాలకోడేరు : రాష్ట్ర వ్యాప్తంగా మార్చి మూడవ తేదీననేడు నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పాలకోడేరు మండల పిహెచ్‌సి విద్యాధికారి డా.సి.హెచ్.వి.రంగం నాయుడు అన్నారు. పల్స్ పోలియో కార్యక్రమంపై అవగాహన ర్యాలీని వైద్య సిబ్బంది పాలకోడేరులో శనివారం నిర్వహించారు.ఈ సందర్భంగా రంగంనాయుడు మాట్లాడుతూ పాలకోడేరు పిహెచ్‌సిపరిధిలో 1-5 సంవత్సారాలు అర్హులైన పిల్లలు 3,299 మంది ఉన్నారని వారందరికీ పోలియో చుక్కలు వేసేలా ఆయా గ్రామాల లోని పాఠశాలలు,అంగన్వాడీ కేంద్రాలు, సచివాలయం,కమ్యూనిటీ హాల్స్ వద్ద 32 పల్స్ పోలియో బూత్‌లను ఏర్పాటు చేశామన్నారు.అర్హులైన పిల్లలందరికీ పోలియో చుక్కలు వేసేందుకు పిహెచ్‌సిపరిధి లోని గ్రామాలకు 150 మంది వైద్య సిబ్బందిని ఏర్పాటు చేశామని, పల్స్ పోలియోబూత్‌ల వద్ద ఆదివారం ఉదయం 7గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు,అంగన్వాడీ సిబ్బంది అందుబాటులో ఉంటారని ఈ అవకాశాన్ని అర్హులైన పిల్లలందరికీ వేసేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైద్య సిబ్బందికి ఆయన తెలిపారు.ఈ అవగాహన ర్యాలీ లో డా.స్వర్ణ నిరంజనీ, డా.లీలా లక్ష్మి, సిహెచ్ఓ సత్యనారాయణ, పిహెచ్ఎన్‌కుమారి,డ్వాక్రా ఏపియం. భారతి,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నిండు జీవితానికి రెండు చుక్కలు

విశాలాంధ్ర - మండవల్లి: పోలియో రహిత సమాజమే లక్ష్యంగా నేటి నుంచి మూడు రోజులు పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని డాక్టర్స్ అనిలా, పవిత్ర తెలిపారు. ఆదివారం పల్స్ పోలియో సందర్భంగా శనివారం వారు మాట్లాడుతూ అప్పుడే పుట్టిన శిశువు నుంచి మొదలుకొని ఐదేళ్ల లోపు పిల్లలకు చుక్కల మందు వేస్తున్నారని తెలిపారు. మండలంలో నేటి నుంచి 5 వ తేదీ వరకు నిర్వహించినున్న పల్స్ పోలియో కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. మండలం మొత్తం 3504 మంది ఐదేళ్ల లోపు చిన్నారులు ఉన్నారని,36 బూత్ లు, 16 సచివాలయాలు, రెండు స్కూల్స్ లో, ఒక అంగన్వాడి సెంటర్ లో ఏర్పాటు చేశామని, ఆదివారం ఉదయం గం.7 నుంచి సాయంత్రం గం.5వరకు పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం వైద్య ఆరోగ్య సిబ్బంది, అంగనవాడీలు, వాలంటీర్లుతో మండవల్లి ప్రధాన సెంటర్ నుంచి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

వృద్ధుడి ఆత్మహత్య

విశాలాంధ్ర - లింగపాలెం : మండలంలోని కలరాయనగూడెం గ్రామంలో జాల యేసు (64) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం మృతుడు కొంతకాలంగా అనారోగ్యంగా బాధపడుతున్నాడని దానిని భరించలేక ఆత్మహత్య చేసుకున్నట్లు ధర్మాజీగూడెం పోలీసులు తెలిపారు. దీనిపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతునికి భార్య కుమారుడు, కూతురు ఉన్నారు.

లోక్ అదాలత్ పై సమీక్ష

విశాలాంధ్ర - భీమవరం : జాతీయ లోక్ అదాలత్‌లో ఇప్పటి వరకు క్రిమినల్, రెవెన్యూ, మున్సిపల్ కేసులుపై, రాజీకి తీసుకున్న చర్యలపై సమీక్షా సమావేశాన్ని పోలీస్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో భీమవరం సీనియర్ సివిల్ జడ్జి బి. అప్పల స్వామి శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో దాదాపు 400 రాజీ చేయడానికి వీలున్న క్రిమినల్ కేసులను గుర్తించినట్లు, వాటిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని సంబంధించిన సబ్ ఇన్స్పెక్టర్‌కు తగిన సూచనలు ఇవ్వాలని ఆయన సూచించారు. ఇప్పటికే ఇరుపక్షాల వారికి నోటీసులు ఇచ్చి కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు డీఎస్పీ నారాయణస్వామి రెడ్డి తెలి పారు. అలాగే సివిల్ కోర్ట్ లో పెండింగ్ లో ఉన్న లాండ్ ఎక్విజిషన్ కేసులు భీమవరం మున్సిపాలిటీ సంబంధించిన కేసుల రాజీ చేసే దిశగా అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని డిప్యూటీ తహసీల్దార్ దుర్గ , మున్సిపల్ ఆఫీస్ మేనేజర్ దేవసేనలకు ఆయన సూచనలిచ్చారు. ఆకివీడు ప్లానింగ్ అధికారి రాధాకృష్ణ, భీమవరం రూరల్ ఇన్స్పెక్టర్ సత్యకిషోర్, వరప్రసాద్ పాల్గొన్నారు.

పోలియో నివారణకు సహకరించాలి

డీఎంహెచ్ఓ మహేశ్వరరావు

విశాలాంధ్ర- భీమవరం టౌన్ : పల్స్ పోలియోకి ప్రతి ఒక్కరూ సహకరించి పోలియో నివారణకు సహకరించాలని జిల్లా వైద్యాధికారి డా.మహేశ్వరరావు అన్నారు. తన కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 1,86 953 వ్యాక్సినేషన్ డోసులు అవసరమని అయితే రెండు లక్షల వ్యాక్సినేషన్ డోసులు అందుబాటులో ఉన్నాయన్నారు. ముందుగా ప్రాథమిక వైద్య కేంద్రాల్లో,అలాగే విలేజ్ క్లినిక్లలో వేయిస్తారని, తరువాత 4,5 తారీకులలో డోర్ టు డోర్ వెళ్లి వ్యాక్సినేషన్ వేస్తారని అన్నారు, దీనికి సంబంధించి అన్ని రకాల మొబైల్ టీమ్స్‌ని ఏర్పాటు చేశామన్నారు. ఒక మెడికల్ ఆఫీసర్, స్టాఫ్ నర్స్, ఏఎన్ఎ, అందుబాటులో ఉంటారన్నారు, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్క తల్లిదండ్రులు వినియోగించుకుని పోలియో నివారణ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డా.దేవి సుధా పాల్గొన్నారు.

రాజోలులో దొంగల హల్‌చల్

తాళాలు వేసి ఉన్న ఇళ్లు టార్గెట్

విశాలాంధ్ర - రాజోలు : రాజోలు పరిసర ప్రాంతాల్లో మూడు రోజుల వ్యవధిలో జరిగిన వరుస దొంగతనాల కారణంగా ప్రజలు హడలెత్తి పోతున్నారు. మూడురోజులు క్రితం రాజోలు ఎల్‌బి నగర్‌లో నివాసం ఉంటున్న రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వ్యాయామ ఉపాధ్యాయుడుగా బొంతు మధు కుమార్ ఇంట్లో దొంగలు చొరబడి గుణపాలతో తలుపులు బద్దలు కొట్టి బీరువాలో ఉన్న సుమారు ఐదు లక్షలు విలువ చేసే బంగారం ఎత్తుకు వెళ్లారు. ఈ సంఘటన మరువక ముందే శుక్రవారం రాత్రి మరో దొంగతనం జరిగింది. శివకోటి గ్రామంలో గాదే వెంకట సూర్య రామ మురళీ కృష్ణ ఇంట్లో దొంగలు చొరబడి తాళాలు బద్దలు కొట్టి ఇంట్లో ఉన్న బంగారం, వెండి, నగదు అపహరించారు. వీటి విలువ సుమారు రూ.20 నుండి 30 లక్షలు వరకు ఉంటుందని బాధితులు తెలిపారు. బుధవారం ఒక వివాహ కార్యక్రమం నిమిత్తం కుటుంబ సభ్యులంతా కలసి వేరే ఊరు వెళ్లారు. శుక్రవారం రాత్రి ఇంటికి వచ్చేసరికి తలుపులు బద్దలు కొట్టి ఉన్నాయి. లోపలకి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న నగదు, బంగారం, వెండి మాయమయ్యాయి. దీంతో దొంగతనం జరిగిందని భావించిన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దొంగతనం జరిగిన ప్రదేశాన్ని రాజోలు ఎస్ఐ పృథ్వి పరిశీలించారు. సంఘటనా స్థలానికి క్లూస్ టీమ్ చేరుకొని ఆధారాలు సేకరించారు. రెండు చోట్లా ఒకే రీతిలో దొంగతనం జరగడంతో ఒక్కడే ఈ దొంగతనానికి పాల్పడ్డాడా, ముఠా సభ్యులు ఉన్నారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కేవలం తాళాలు వేసి ఉన్న ఇళ్లను మాత్రమే టార్గెట్ చేసి దొంగతనాలకు పాల్పడుతున్నారని పోలీసులు నిర్ధారించారు. ప్రజలు ఇల్లు వదిలి ఎక్కడికైనా ఊరు వెళ్ళేటప్పుడు ప్రక్క ఇంటి వారికి చెప్పి వెళ్లాలని, విలువైన వస్తువులు బ్యాంకు లాకర్‌లో పెట్టుకుని వెళ్లాలని ఎస్ఐ పృథ్వి సూచించారు.

విద్యార్థుల సేవలు వినియోగించుకోవాలి

విశాలాంధ్ర - పెద్దాపురం : రైతాంగం రాజమహేంద్రవరం ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ కళాశాల విద్యార్థుల సేవలను సద్వినియోగం చేసుకోవాలని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి వీర్రాఘవరావు అన్నారు. మండలంలోని వడ్లమూరు గ్రామంలో శనివారం వ్యవసాయ కళాశాల విద్యార్థులు బలివాడ శ్రీలక్ష్మి, డి అనూష, సుప్రజ, వర్ష, కావ్య బృందం గ్రామంలో పర్యటించింది. గ్రామంలో రైతుల వ్యవసాయ పద్ధతులు, ప్రభుత్వం నుంచి అందుతున్న సేవలు, రైతులకు ఉపయోగపడే సూచనలు సలహాలిస్తూ 45 రోజుల పాటు గ్రామంలో రైతులకు అందుబాటులో ఉండి సేవలందిస్తామని వారు తెలిపారు. రైతులకు మెరుగైన వ్యవసాయ పద్ధతులు వివరిస్తూ, వ్యవసాయ రంగం పట్ల విద్యార్థులు మరింత అవగాహన ఏర్పర్చుకోవాలని వీర్రాఘరావు అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కళ. రైతులు పాల్గొన్నారు.

చెరువులో పడి యువకుడి మృతి

విశాలాంధ్ర - లింగపాలెం : జిల్లాలోని లింగపాలెం మండలం ఎడవల్లి గ్రామంలో చెరువులో పడి తుమ్మలపల్లి రాజేష్, చంటి (29) మృతి చెందాడు. చెరువులో పడిన మృతుడిని స్థానికులు బయటకు తీశారు. మంచి ఈతగాడుగా గుర్తింపు ఉన్న ఈ యువకుడు చెరువులో పడి మృతి చెంద డంపై పలు అనుమానాలు ఉన్నాయని పలువురు అంటున్నారు. మృతుడు డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. ధర్మాజీగూడెం పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

టీడీపీ తీర్థం పుచ్చుకున్న వైసీపీ నాయకులు

విశాలాంధ్ర - భీమవరం : ముఖ్యమంత్రి జగన్ అరాచక విధ్వంస పాలనతో విరక్తి చెందిన వైసీపీ నాయకులు టీడీపీలోకి చేరుతున్నారని, వచ్చే వారందరినీ స్వాగతిస్తామని టీడీపీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి తెలిపారు. భీమవరంలోని జిల్లా కార్యాలయంలో మండలంలోని గొల్లవానితిప్ప గ్రామ వైసీపీ నాయకుడు నౌండ్రు రాజేంద్రప్రసాద్ తదితరులకు తోట సీతారామలక్ష్మి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి మాట్లాడుతూ పరిపాలన చేతకాని జగన్ ఐదు సంవత్సరాలుగా రాష్ట్రాన్ని అన్ని రంగాలలో దివాలా తీయించి అప్పుల్లో అగ్రస్థానంలో ఉన్నారని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేయలేని జగన్ అసమర్థ ముఖ్యమంత్రిగా వైసీపీ నాయకులు గుర్తించి వైసీపీ నుండి టీడీపీలోకి వస్తున్నారని, రానున్నది తెదేపా జనసేన ప్రభుత్వమన్నారు. కార్యక్రమంలో భీమవరం మండల అధ్యక్ష కార్యదర్శులు రేవు వెంకన్న, కౌరు పృథ్వీశంకర్, పట్టణ టీడిపి అధ్యక్ష కార్యదర్శులు ఇందుకురి సుబ్రహ్మణ్యరాజు, గూడూరి సుబ్బారావు, మాజీ ఎంపీపీ బర్రె నెహ్రూ, తెలుగుయువత అధ్యక్షుడు కొయ్యలగడ్డ గణపతి, గ్రామ పార్టీ నాయకులు కొయ్యలగడ్డ రామకృష్ణ, కొయ్యలగడ్డ సత్యనారాయణ, మంద ఆమోసు, కోయ్యలగడ్డ చింతారావు, కొట్టు సత్యనారాయణ, గుద్దటి పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ ముద్రగడకు ఏయూ డాక్టరేట్

విశాలాంధ్ర - భీమవరం: కస్టమర్ సర్వీసెస్‌లో నూతన విధానం వలన తక్కువ ఖర్చు, తక్కువ సంఖ్యలో ఉద్యోగులతో అత్యుత్తమ సర్వీసులు అందించవచ్చునని ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ముద్రగడ వెంకట సుబ్బారావు తన పరిశోధనలు ద్వారా వెల్లడించారు. సుబ్బారావు చేసిన పరిశోధనకు ఆంధ్ర యూనివర్సిటీ డాక్టరేట్‌ను అందచేసిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి మురళీకృష్ణంరాజు చెప్పారు .సామాన్య ప్రజలకు ఉపయోగపడే మంచి ప్రాజెక్టు చేపట్టిన డాక్టర్ ఎంవి సుబ్బారావును కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత వర్మ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ ఆటోమేషన్ ఆఫ్ ఐటీ ఇన్సిడెంట్ రెస్పాన్స్ సిస్టం యూజింగ్ మిషన్ లెర్నింగ్ అండ్ ఎన్ఎల్‌పి అప్రోచెస్" అనే అంశంపై తాను రూపొందించిన పరిశోధనకు గాను ఆంధ్రాయూనివర్సిటీ పీహెచ్డీ ప్రధానం చేసిందని ఆయన పేర్కొన్నారు. ఏయూ ప్రొఫెసర్ కె.వెంకట్రావు, గీతం యూనివర్సిటీ ప్రొఫెసర్ సురేష్ చిట్టినేని పర్యవేక్షణలో తాను పరిశోధనలు చేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతి రాజు మాట్లాడుతూ సొసైటీ అప్లికేషన్స్ మరింత సమర్థవంతంగా వేగంగా సామాన్యుడికి అందే విధంగా పరిశోధనలు చేసిన డాక్టర్ సుబ్బారావును ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షులు ఎస్వీ రంగరాజు, ఐటీ ప్రొఫెసర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లను కమ్మేసిన హిమపాతం

- వాహనదారులకు ప్రాణసంకటం



విశాలాంధ్ర - రాజానగరం : నియోజకవర్గ కేంద్రమైన రాజానగరంలో మంచు దుప్పటి కప్పేసింది. రహదారుల పై హిమపాతం ధారాళంగా కురవడంతో ఎదురుగా వచ్చేవారు కనిపించనంతగా దట్టమైన పొగమంచు కమ్ముకుని ఉంది. ఈ సందర్భంగ శనివారం ఉదయం 7 గంటలైనప్పటకి మంచు ధారాళంగా కురుస్తూనే ఉండడంతో జాతీయ రహదారి,ఎడిబి రోడ్డులపై ఎదురుగా వచ్చే,ముందు వెళ్ళే వాహనాలు కనిపించక పోవడంతో లైట్లు వేసుకుని నడపాల్సిన పరిస్థితి ఏర్పడింది.దీంతో వాహనాదారులకు ప్రయాణం ప్రాణసంకటంగా మారింది. రెండ్రోజులుగా చలి తీవ్రత కూడా పెరిగింది. మండలాల్లో రహదారులపై పొగమంచు కమ్మేయడంతో మండలంలోని పలుగ్రామాల్లో పొలాలకు వెళ్లే రైతులు, ఉపాధి హామీ పనులకు వెళ్ళే కూలీలు అవస్థలు పడ్డారు. సూర్యుడు వచ్చే వరకు ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది.ఇలానే కొనసాగితే పిల్లల,వృద్ధులు ఆరోగ్యం పై ప్రభావం చూపిస్తుందని అవేదన వ్యక్తం చేస్తున్నారు.మరి కొంత మంది హిమపాతంలో తిరుగుతూ చల్లగాలులను ఆస్వాదిస్తున్నారు.

ఓటర్ల జాబితా సవరణకు సత్వర చర్యలు

అవగాహనా సదస్సులో ఆర్డీవో జేఎస్ రామారావు

విశాలాంధ్ర - పెద్దాపురం : భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో చేపట్టే ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో వచ్చిన క్లయిమ్‌లు పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టామని, అన్ని రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు సహకారాన్ని అందించాలని పెద్దాపురం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో జెఎస్ రామారావు కోరారు. స్థానిక ఆర్డీవో కార్యాలయ చాంబర్‌లో శనివారం ఎన్నికల ప్రక్రియపై వివిధ రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో జేఎస్ రామారావు మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితాలో వచ్చిన క్లయిమ్ పరిష్కారం పట్ల మరింత అవగాహన అవసరమన్నారు. ఆయా క్లయిమ్లు సత్వన పరిష్కారానికి చర్యలు చేపడతామని ఆర్డీఓ జేఎస్ రామారావు అన్నారు. అనంతరం ఓటర్ల జాబితా విధానం. ఎన్నికల ప్రక్రియ తదితర అంశాలపై ప్రజా ప్రతినిధులకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కమిషనర్ కెవి పద్మావతి. జడ్పీటీసీ గవరసాని సూరిబాబు,(వైఎస్సార్ సీపీ), రంధి సత్యన్నారాయణ (టీడీపీ) నీలపాల సూరిబాబు (సీపీఎం)లతో పాటు ఆయా పార్టీల ప్రజా ప్రతినిధులు సిబ్బంది పాల్గొన్నారు.

భీమశంకర స్వామి కళ్యాణం

విశాలాంధ్ర - జగ్గంపేట : మండలం ఇర్రిపాకలో టీడీపీ నేత జ్యోతుల నెహ్రూ కుటుంబం ఆధ్వర్యంలో జరుగుతున్న కోటి పార్థివలింగ మహా రుద్రాభిషేకంలో శనివారం 6వ రోజు భీమశంకర స్వామి కళ్యాణం, నవగ్రహ హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో నెహ్రూ, మణి దంపతులు, జ్యోతుల నవీన్ లక్ష్మీదేవి, తోట సర్వారాయుడు సునీత దంపతులు పీటలపై కూర్చుని భీమశంకర స్వామి కళ్యాణాన్ని జరిపించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కోర్పు లచ్చయ్య దొర, ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కుంచె రాజా, జీనుమణి బాబు, పైడిపాల సూరిబాబు, రేఖ బుల్లి రాజు, పాఠంశెట్టి రవి, కుంచే రామకృష్ణ, సూరంపాలెం బాలు, యల్లమిల్లి సీఎం, పాఠం శెట్టి బాబ్జి, వేలాదిగా భక్తులు తరలివచ్చారు.